అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 11 జనవరి 2023

రెండు ఆలయాల్లో దొంగతనాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కొటార్మూర్ శుక్రవారం దేవి ఆలయం, మండలంలోని చేపూర్ గ్రామ సాయిబాబా ఆలయాలు చోరీకి గురైయ్యాయి. సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. కోటార్మూర్ శుక్రవారం దేవి ఆలయంలో సీసీ కెమెరాలు, హుండీ తాళాలు పగుటగొట్టారు. మొత్తం కలిపి సుమారుగా 40 వేల వరకు ఆస్తి నష్టం వాటిలినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆర్మూర్ పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు నిఘా పెట్టాలని, పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్నారు. అదే విధంగా ఇది వరకు నమోద అయిన కేసుల్లో దుండగులను సకాలంలో పట్టుకొని శిక్షించాలని కోరుతున్నారు.

పంటల నమోదు పరిశీలన


వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్, నాగపూర్ గ్రామాల్లో యాసంగి పంటల నమోదును పరిశీలించినట్లు మండల వ్యవసాయాధికారి మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఈవోలు గ్రామాల్లో సర్వే నంబర్, పంటల వారీగా వరి, మొక్కజొన్న, జొన్న పంటలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. యాసంగి పంటల నమోదును పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. పంటల నమోదు వల్ల యాసంగిలో పంటల యొక్క విస్తీర్ణము, దిగుబడులు, మార్కెటింగ్ అంచనాపై ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

వైరల్ కోసం విద్వేషం..

- కోటగిరి ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై ప్రణాళికంగా దాడి..
- సెప్టెంబర్‌లో రహస్యంగా వీడియో
- బైరి నరేష్ వ్యవహారంతో ముందుకు తోడిన వైనం
- దాడికి యత్నించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు
- దుండగులను శిక్షించాలి : సీఐటీయూ, కేవీపీఎస్ డిమాండ్



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

"మీరు వినాయక చవితికి చందా ఇవ్వరా? మీరు హిందువు కాదా? ప్రభుత్వ టీచర్‌కు లక్షల్లో జీతం ఉంటుంది. ఆ మాత్రం చందా ఇవ్వరా? హిందూ దేవుళ్లకు చందా ఇవ్వకుంటే ఎలా? సరస్వతి లేకుండానే మీకు చదువు వచ్చిందా. మీది ఏ కులం" ఇలా వినాయక చవితికి చందా ఇవ్వలేదని రెచ్చగొట్టి రహస్యంగా వీడియో చిత్రీకరించారని కోటగిరి జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ టీచర్ మల్లిఖార్జున్ వాపోయారు.

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ టీచర్ మల్లిఖార్జున్ హిందూ దేవుళ్లపై రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ వీహెచ్‌పీతో పాటు భజరంగ్‌దళ్ తదితర హిందూ సంఘాలు ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పాత వీడియోను ముందుకు తీసుకొచ్చి విద్వేషం నింపే ప్రయత్నం చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో ఇప్పటికే ప్రభుత్వ టీచర్ మల్లిఖార్జున్ పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వేశారు. సెప్టెంబర్‌లో వీడియోను జనవరిలో ముందుకు తీసుకొచ్చి జెడ్పీహెచ్ఎస్ ఎదుట ఆందోళన చేపట్టారు. మల్లిఖార్జున్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ తన మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించారు. గుడిలోకి తీసుకెళ్లి బలవంతంగా 'జైశ్రీరాం' అనిపించి, భజన చేయించారు. చివరకు నుదుటిపై బొట్టుపెట్టి మళ్లీ స్కూల్‌కు పంపారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విద్యాశాఖాధికారులు విచారణ చేపట్టారు. స్కూల్ హెచ్ఎం విద్యార్థులతో పాటు సిబ్బందితో ఈ విషయమై విచారణ సైతం చేపట్టారు. ఈ విచారణలోనూ టీచర్‌కు సంబంధించి వ్యతిరేకంగా ఏమీ తేలలేదు. విద్యార్థులకు నాస్తికత్వం బోధిస్తాడని కానీ, సిబ్బందితో అన్యమత ప్రచారం చేస్తాడని కానీ తేలలేదు. కోటగిరి జెడ్పీహెచ్ఎస్‌లో మల్లిఖార్జున్ 2018 నుంచి తెలుగు సబ్జెక్టు బోధిస్తున్నారు. మల్లిఖార్జున్‌కు ప్రజాసంఘాల నుంచి మద్దతు లభిస్తోంది. మంగళవారం బోధన్‌లోని తన నివాసంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు పరామర్శించారు. అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.

మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు



దళిత ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌ను కులం పేరుతో దూషించి బలవంతంగా గుడికి తీసుకెళ్లి బొట్టు పెట్టించి అవమానించిన మతోన్మాద బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ దుండగులను కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించి తీవ్రమైన పరుష పదజాలంతో హేళన చేశారని విమర్శించారు. ఒక టీచర్ మూఢత్వాలు ఎందుకు బోధిస్తాడని ప్రశ్నించారు?. సైన్స్ బోధించడం నేరం కాదన్నారు. ఆచార్య దేవోభవ అని గౌరవించుకుంటామని ప్రగల్బాలు పలికే మతోన్మాదులు ఎందుకు టీచర్‌ను హింసించారో చెప్పాలన్నారు. ఈ ఘటనపై కేవిపిఎస్ ఆధ్వర్యంలో అన్ని సామాజిక ప్రజాసంఘాలను కలుకొని ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ప్రభుత్వ టీచర్‌పై దాడి దుర్మార్గం

ఎస్ వీరయ్య, సీఐటీయూ



ప్రభుత్వ టీచర్‌పై హిందుత్వ మతోన్మాదులు దాడి చేయడం దుర్మార్గమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య విమర్శించారు. బావిపౌరులను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు రాజ్యాంగబద్ధంగానే వ్యాఖ్యలు చేశాడని సమర్థించారు. రాజ్యాంగంలోని 51వ అధికరణం సైతం భారతీయ పౌరులకు శాస్త్రీయ దృక్పథం వివరింపచేయాలని పేర్కొన్నదని గుర్తు చేశారు. ప్రభుత్వ టీచర్ బాధ్యతగా శాస్త్రీయ దృక్పథం నేర్పించే ప్రయత్నం చేశారని అన్నారు. సమాజం పట్ల బాధ్యతగా ఉన్న మల్లిఖార్జున్‌కు సీఐటీయూ అండగా ఉంటుందని, సమాజం సైతం అండగా నిలవాలని కోరారు.



బోధన్‌లో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

రవాణా రంగాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్ర

- వారి కింద దేహి అనేలా కార్మికుల బతుకులు మార్చుతున్నారు
- కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులు
- సంఘర్షణ యాత్రలో పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) జాతీయ ఉపాధ్యక్షులు వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

నవతెలంగాణ-బోధన్/బాన్సువాడ

'దేశ ఆర్థిక వ్యవస్థలో వెన్నుదన్నుగా ఉంటున్న రవాణా రంగ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి. కేంద్రంలోని నరేంద్ర మోడీ తీసుకువచ్చిన మోటారు రవాణా సవరణ చట్టం-2019 ప్రకారం మొత్తం రవాణా రంగాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్ర జరుగుతుంది. ఈ చట్టం అమలులోకి వస్తే వ్యక్తిగత వాహనాలు అంటే ఆటో, టాక్సీ, మినీ గూడ్స్, బస్సులు నడుపుకుంటు ఉపాధి పొందుతున్న వారు సైతం ఇకపై ఈ వాహనాలన్నిటిని కార్పొరేట్ సంస్థలకి అప్పజెప్పి వారి కింద దేహి అని బతికేలా రవాణా రంగ కార్మికుల జీవితాలను దిగజార్చే పరిస్థితి నరేంద్ర మోడీ తీసుకు వస్తున్నారు. ఈ విధానాలు అత్యంత ప్రమాదకరమని' తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జాతీయ ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య అన్నారు.

యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర మంగళవారం ఉదయం నిజామాబాద్ జిల్లా బోధన్, కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కొనసాగింది. బోధన్ బస్టాండ్ వద్ద యాత్రకు కార్మికులు, నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ నిజమైన దేశభక్తులుగా కార్పోరేట్ శక్తులను ఎదిరించి రవాణా రంగ వ్యవస్థను కాపాడుకునే విధంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ తీసుకువచ్చిన కార్మిక చట్టాల సవరణ వల్ల సంఘాలు పెట్టుకునే హక్కును హరించే ధోరణిని తెలంగాణలోని టీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీలో అమలు చేస్తున్నట్టుగా స్పష్టంగా కనబడుతోందని అన్నారు. ఈ ధోరణిని రాష్ట్ర ప్రభుత్వం విడనాడి ఆర్టీసీ సంస్థను పరిరక్షిస్తూ, ఆర్టీసీలో కార్మిక సంఘాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షలకు పైగా ఉన్న రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన ప్రభుత్వాలు ఈరోజు అనేక జిల్లాలలో ఆటోలను నిలుపుకోవడానికి అడ్డాలను కేటాయించకపోగా, రోడ్లపై నిలబెట్టిన వాహనాలను దొంగ చాటుగా చెట్ల పొదల్లో దాక్కుంటూ ఫోటోలు కొడుతూ విచ్చలవిడిగా ఫైన్లు వేస్తూ రవాణా రంగ కార్మికులను నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు సాధన కోసం ఐక్య ఉద్యమాలే శరణ్యమని వాటికి కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నూర్జహాన్, శంకర్‌గౌడ్, ఏశాల గంగాధర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

భర్త మృతిని తట్టుకోలేక భార్య ఆత్మహత్య

- తల్లిదండ్రిని కోల్పోయిన చిన్నారులు.. రాజంపేట్‌లో విషాదం


అశోక్, భార్గవి (ఫైల్‌ఫోటో)


తల్లిదండ్రిని కోల్పోయిన చిన్నారులు

నవతెలంగాణ-రాజంపేట్

ప్రేమించుకుని పెండ్లి చేసుకున్నారు. ఎన్నో ఆశలతో దాంపత్య జీవితాన్ని ప్రారంభించారు. ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాగుతుండగా.. ఊహించని ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. ప్రమాదవశాత్తు భర్త బావిలో పడి మృతిచెందగా.. జీర్ణించుకోలేకపోయిన భార్య.. ఉరేసుకొని తనువు చాలించుకుంది. దీంతో వారి ఇద్దరు పిల్లలను అనాథలైయ్యారు. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజంపేట్ గ్రామానికి చెందిన మెత్తుల అశోక్, భార్గవి (27) మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అశోక్ వృత్తిరీత్యా వ్యవసాయం చేసుకుంటూ మేస్త్రి పని చేసేవాడు. 20 రోజుల క్రితం అశోక్ తన వ్యవసాయ భూమిలో గల బావిలో నుండి పశువులకు నీటిని తీసుకురావడానికి దిగగా ప్రమాదవశాత్తు బావిలో నీటమునిగి మృతిచెందాడు. అప్పటి నుండి తన భర్త మృతిని జీవించుకోలేని భార్గవి.. తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన తండ్రి.. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కాగా వీరికి మూడేండ్ల పాప, యేడాది వయసున్న బాబు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో చిన్నారులు అనాథలైయ్యారు. దీంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ రాజు తెలిపారు.

సిద్ధులగుట్టను సందర్శించిన కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఎంతో ప్రఖ్యాతి గాంచిన నవనాథ సిద్దుల గుట్టను కలెక్టర్ నారాయణ రెడ్డి మంగళవారం సందర్శించారు .ముఖ్యమంత్రి కేసిఆర్ పర్యటన సందర్భంగా ముందస్తుగా పరిశీలన చేశారు. ఘాట్‌రోడ్. సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ దంపతులు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్‌మున్న, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు శేఖర్ రెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్, సుంకారి సుజాత రంగన్న, బదాం రాజ్ కుమార్, బండారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అత్యాధునిక ల్యాబ్‌లు

- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- సౌత్‌క్యాంప్‌లో ఫిజిక్స్ ల్యాబ్‌ను ప్రారంభించిన టీయూ వీసీ ప్రొఫెసర్ రవీంద్రగుప్త

నవతెలంగాణ-భిక్కనూర్


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న టీయూ వీసీ రవీందర్‌గుప్త

తెలంగాణ యూనివర్సిటీలో ఉన్న అన్ని విభాగాలను ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని, భౌతిక శాస్త్ర విభాగానికి కావలసినటువంటి అన్నివసతులు కల్పించినట్టు టీయూ వీసీ ప్రొఫెసర్ రవీంద్రగుప్త అన్నారు. భిక్కనూర్ మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న టీయూ సౌత్ క్యాంపస్‌లో భౌతిక శాస్త్ర ప్రయోగశాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌతిక శాస్త్ర విభాగంలో 6 ప్రయోగశాలను ప్రారంభించినట్టు తెలిపారు. విద్యార్థులు ఫెలోషిప్ కోసం రిసెర్చ్‌లో భాగంగా ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన వ్యక్తులుగా ఎదగాలన్నారు. ఈ ప్రయోగశాలలో 23 కంప్యూటర్లు, మైక్రో కంట్రోలర్ కిట్లు, మైక్రో ప్రాసెస్ కిట్లు, ఎలక్ట్రానిక్ సర్క్యూట్ బోర్డ్, స్పెక్ట్రోస్కోపి ల్యాబ్, జీమాన్ ఎఫెక్ట్, లేజర్ సెట్ అప్స్, వివిధ ప్రయోగాలకు సంబంధించిన అన్ని పరికరాలను అందించనున్నట్టు తెలిపారు.

తెలంగాణ సౌత్ క్యాంపస్‌కు అన్ని విధాల సహకరిస్తున్న ఉపకులపతికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, విభాగాధిపతి డాక్టర్ లలిత ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సైన్స్ డీన్ ప్రొఫెసర్ అరుణ, విభాగ ప్రొఫెసర్‌లు మోహన్‌బాబు, అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ యాలాద్రి, హరిత, దిలీప్, శ్రీమాతా, సరిత, వివిధ విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రూ.10 కోట్ల మంజూరు

- ఫంక్షన్‌హాళ్లు నిర్మిస్తాం : ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజక వర్గం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం 10 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని, ఈమేరకు జీవో జారీ చేసిందని

ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సకల కులాలకు సమాన గౌరవం ఉండాలన్న లక్ష్యంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కుల సంఘాలకు పెద్ద ఎత్తున కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఆర్మూర్ పట్టణం, రూరల్, నందిపేట్, మాక్లూర్ మండలాల్లో మున్నూరు కాపు, వంజర, పద్మశాలి, రజక, కమ్మవాడ, మైనారిటీ, ముదిరాజ్, గూండ్ల, గౌడ, దేవాంగ తదితర సామాజిక వర్గాల వారికి మరిన్ని ఫంక్షన్ హాళ్ల నిర్మించడానికి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వినతి మేరకు ప్రభుత్వం తాజాగా 10 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. తమ విన్నపాన్ని మన్నించి అభివృద్ధి పనులకు రూ.10కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడంపట్ల ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గం అభివృద్ధికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తాను, నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అవెన్యూ ప్లాంటేషన్‌పై పత్యేక శ్రద్ధ చూపాలి

- జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


రోడ్డు పక్కన మొక్కలను పరిశీలిస్తున్న తిరుమల ప్రసాద్

హరితహారంలోని అవెన్యూ ప్లాంటేషన్ పట్ల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపి మొక్కలను రక్షించాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో రోడ్డు కిరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. బాలనగర్ గ్రామపంచాయతీలో మన ఊరి మనబడిలో భాగంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు పాఠశాలకు వేస్తున్న కలర్లు పరిశీలించి పలు సూచనలను చేశారు.

మనోహరాబాద్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాణంగాన్ని పరిశీలించారు. పాఠశాలలో నిర్మిస్తున్న కిచెన్ గార్డును పరిశీలించి తగు సూచనలను చేశారు. అనంతరం సాయంత్రం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో హరితహారంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రోడ్డు కిరువైపులా నాటిన మొక్కల్లో ఏవైనా మొక్కలు చనిపోతే తిరిగి వాటి స్థానంలో మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఎంఈఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలి

- ఐసీడీఎస్ పీడీకి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

న్యూట్రీషన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం (ఎన్‌హెచ్‌టిఎస్) యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కామారెడ్డి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి పీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా విధులు నిర్వహించాలని అంగన్‌వాడీలకు ఒత్తిడి తీసుకురావొద్దని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే అంగన్‌వాడీలకు వారి విధులకు మించిన పనులు అప్పగిస్తున్నారని, ప్రస్తుతం యాప్ ద్వారా వివరాలు నమోదు చేయడం వారికి కష్టసాధ్యమవుతుందని తెలిపారు. వెంటనే ఈ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, యూనియన్ నాయకులు కల్పన, పద్మజ, సునంద, రాజేశ్వరి, మంజుల, రాణి, సుధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిలో వర్గపోరు

నవతెలంగాణ-పిట్లం

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం వర్గపోరు నడుస్తోంది. గత మార్కెట్ కమిటీ చైర్మన్ పాలకవర్గం పదవీకాలం గతేడాది డిసెంబర్ 22తో ముగిసింది. అయితే ఈసారి చైర్మన్ పదవిని ఓసీ మహిళకు కేటాయించారు. దీంతో పదవి కోసం ఇద్దరు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ మండల అధ్యక్షులుగా కొనసాగుతున్న బీసీ నేత వాసరి రమేష్ సతీమణికి ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తుండగా.. ఓసీ కెటగిరికి వచ్చినందున ఓసీ మహిళకు సీటు కేటాయించాలని మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి తన భార్యకు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. ఇరువురు తమ ముఖ్య నాయకులను కలిసి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

టచ్ చేస్తూ.. టార్చర్ చేస్తున్నాడు

- ఉపాధ్యాయుడు వద్దంటూ విద్యార్థినుల కంప్లైంట్
- అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్లను డిస్మిస్ చేయాలి : పీడీఎస్‌యూ



నవతెలంగాణ-నిజామాబాద్

'రాజేందర్ సార్ మమ్మల్ని ఫిజికల్‌గా టార్చర్ చేస్తుండు. ఊరికనే పిలిచి మాట్లాడుదాం అని అనుకుంటూ టచ్ చేస్తుండు. ఉపాధ్యాయుడు రాజేందర్, ఉపాధ్యాయిని కుదైజ మాతో చెడుగ ప్రవర్తిస్తున్నారు. వారు మాకు వద్దు' అంటూ నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కంప్లైంట్ చేశారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు.. విద్యార్థుల పట్ల కీచకంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినులు సోమవారం లేఖ రాయగా.. మంగళవారం వెలుగుజూసింది. కాగా ఎంఈవో సోమవారం విచారణ చేపట్టారు. నివేదికను డీఈవో, కలెక్టర్‌కు అందజేసినట్టు సమాచారం. శాఖ పరమైన చర్యలు తీసుకోనున్నట్టు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. కీచక ఉపాధ్యాయులను తక్షణమే డిస్మిస్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు.

వివరాలు మెయిన్‌లో..

బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చీమన్‌పల్లి గ్రామంలో సోమవారం బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు అంగన్వాడి సూపర్వైజర్ విజయ రాణి తెలిపారు. కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశం బాల్యవివాహాలు జరగకుండా చూడడం, భ్రూణ హత్యలు, బాల కార్మిక వ్యవస్థ, బడి మానివేయడం, ఆడపిల్లలపై హత్యాచారాలు, వాటి ఫిర్యాదు కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1098పై అవగాహన కల్పించడం తదితర అంశాలు ఈ కమిటి పర్యావేక్షిస్తుందని తెలిపారు. జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, విద్య హక్కు, రక్షణ పొందే హక్కు, తదితర హక్కులపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించడం అని తెలిపారు. ఈ కమిటీలో సర్పంచ్ పద్మ శివారెడ్డి చైర్మన్‌గా వ్యవహరిస్తారని, కన్వీనర్‌గా అంగన్వాడి కార్యకర్త, మిగతా 14 మంది సభ్యులు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నవీన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ పాఠశాలలో ఆరవ తరగతిలో 100 సీట్ల భర్తీతో పాటు ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఫిబ్రవరి 15 వరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 16న పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని సూచించారు. జనరల్ విద్యార్థులకు 200 రూపాయలు ఎస్సీ, ఎస్ టి. బీసీ, వికలాంగ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు 125 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నేడు చలో కోటగిరిని విజయవంతం చేయండి

- విద్యార్థి సంఘాలు
- ప్రభుత్వ ఉపాధ్యాయులు మల్లికార్జున్‌పై దాడికి నిరసనగా కార్యక్రమం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేడు (బుధవారం) నిర్వహించే చలో కోటగిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు మల్లికార్జునపై దాడికి నిరసనగా చలోకోటగిరి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం నగరంలోని ఆర్ అండ్‌బి అతిథి గృహంలో బీవీఎం రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ బట్టు, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విఘ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామ్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు సాయిరెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక చవితికి చందా అడిగితే ఇవ్వని టీచర్ మల్లికార్జున్‌ను బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఉద్దేశపూర్వకంగా అన్యమత ప్రచారం చేస్తున్నాడని, దేవుళ్లను కించపరు స్తున్నాడనే నెపంతో అమానవీయంగా అవమానకరంగా హింసించారని పేర్కొన్నారు. చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొని బిజెపి, విశ్వహిందూ పరిషత్ వారు ఒక ప్రభుత్వ టీచర్‌ని బలవంతంగా స్కూల్‌నుంచి తీసుకెళ్లి క్షమాపణ చెప్పించుకోవడం, మానసికంగా హింసించడం సహించరానిదని అన్నారు. దీనికి పూర్తి బాధ్యత భారతీయ జనతా పార్టీ వహించాలని అన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారతీయ విద్యార్థి మోర్చా బీవీఎం రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ బట్టు మాట్లాడుతూ... ఉపాధ్యాయ హక్కులను హరించే విధంగా మతోన్మాద మూకలు వ్యవహరించడం చట్ట విరుద్ధమని, విజ్ఞానవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయడంలో ఉపాధ్యాయుడు కీలకమైన పాత్ర పోషిస్తాడని అన్నారు. విధులకు ఆటంకం కల్పించి, ప్రభుత్వ ఉపాధ్యాయున్ని దారుణంగా అవమానించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేకుంటే ఉద్యమాన్ని వేగవంతం చేస్తామన్నారు. పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విఘ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామ్, పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు సాయిరెడ్డి, పీవైఎల్ రాష్ట్ర నాయకులు సత్యం, బీవీఎం జిల్లా అధ్యక్షులు రాహుల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి బావ ప్రకటన స్వేచ్ఛ హక్కులను కల్పించిందని, మతాన్ని



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

విశ్వసించడం, విశ్వసించకపోవడం అనేది ప్రతి పౌరుడి ఇష్టమని అన్నారు. ఒక దళిత టీచర్ ను నడిరోడ్డు మీద అవమానించినా పోలీస్ వ్యవస్థ సరైన రీతిలో స్పందించక పోవడం తగదని తెలిపారు.

వారి మీద నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరగా విచారణ పూర్తి చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విఘ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామ్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు సాయిరెడ్డి, పీవైఎల్ రాష్ట్ర నాయకులు సత్యం, బీవీఎం జిల్లా అధ్యక్షులు రాహుల్, జిల్లా నాయకులు సాయికుమార్, అధిపతి, విద్యార్థి సంఘాల నాయకులు విశాల్, సుబోద్, సునీల్, కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు, జీతాలు ఇంకా పడలేదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ధనిక రాష్ట్రంలో, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు, ఉద్యోగులకు పదో తారీకు అయినా పెన్షన్ గాని, జీతాలు కానీ ఇంతవరకు పడలేదని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ ఆమంగళవారం తమ సంఘ కార్యాలయంలో ఆందోళనను చేపట్టారు. గత సంవత్సర కాలంపైగా ఇదేవిధంగా ఆలస్యం అవుతున్నాయని, దీని మూలంగా బ్యాంకు లోన్లకు అదనపు చార్జీలు భరిస్తున్నామని, ఇంటి అద్దెలు, వైద్యానికి, నెలసరి మందులకు, ఇతర ఖర్చులకు ఎంతో ఇబ్బంది పడుతున్నామని వారు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, మరొక డీఏ దీనికి తోడు అవుతున్నాయని అన్నారు. డీఏలు చెల్లించకుండా ఇంతకాలం వేధించటం ఫ్రెండ్లీ ప్రభుత్వం అనిపించదని వారు తెలిపారు ఈ ఆందోళనా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కే రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి మదన్మోహన్, జిల్లా నాయకులు దత్తాద్రిరావు, సుదర్శన్ రాజు, ముత్తారం నరసింహస్వామి, ప్రసాద్ రావు, భోజరావు, హనుమాన్లు, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్ల పనులు పున:ప్రారంభం



పనులను ప్రారంభించిన నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

టీఎస్ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా యువ నాయకులు. ధర్పల్లి జడ్పీటిసి బాజిరెడ్డి జగన్ సూచనల మేరకు మల్క్యాపూర్ తాండ గ్రామంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పున: ప్రారంభం చేశారు. 30 ప్లాట్లకు గాను బేస్మెంట్ లెవెల్‌లో చేసిన తర్వాత మిగతా పదిప్లాట్లకు మంగళవారం పున ప్రారంభం చేసి కొలతలు చేసి ముగ్గు పోశారు. ఎంపీపీ ప్రేమ్ నాయక్ ఇంజనీయర్‌తో కలిసి లబ్ధిదారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, దర్యానాయక్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గన్ని రామ్ నాయక్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లోగల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ సి.నారాయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్ల నడుమ కొనసాగిన మరమ్మతు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తుది దశ పనులు రెండుమూడు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, పంచాయతీ రాజ్ ఈ.ఈ శంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

ప్రజలమధ్య వైశమ్యాలను పెంచటం సరికాదు

- వామపక్షాల నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీ నాయకులు

రాజకీయ ప్రయోజనాలకోసం ప్రజలమధ్య బీజేపీ నాయకులు వైశమ్యాలను పెంచడం సరైంది కాదని వామపక్ష నాయకులు అన్నారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజల మధ్య వైశ్యాలను పెంచి రాజకీయ లబ్ధి పొందటానికి బీజేపీ అనుబంధ సంస్థలైన ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ లాంటివి విశ్వాసాలను అడ్డం పెట్టుకుని దేవుడి పేరుతో రాజకీయ లబ్ధి పొందటానికి ప్రయత్నిస్తు న్నారని, ఇది ప్రజాస్వామ్యానికి సరైనది కాదని అన్నారు. ప్రజల మధ్య ఐక్యతను పెంచడంతో పాటు విశ్వాసాలు, నమ్మకాలు గౌరవించాలని అందుకు అధికారులు, పోలీసులు ప్రయత్నం చేయాలని అన్నారు. కోటగిరి ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్ గతంలో తమ విశ్వాసాలను వెల్లడించినందున వాటిని మనసులో పెట్టుకొని బజరంగ్ దళ్ ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలకు చెందిన వ్యక్తులు ఆయనపై బలవంతంగా తమ భావజాలాన్ని రుద్దడం కోసం ప్రయత్నించటం సరైంది కాదని అన్నారు. అలా దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులకు శాస్త్రీయ విద్యావిధానాన్ని బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు. ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలను దృష్టిలో పెట్టుకొని విద్వేషాలను ప్రేరేపించటం సరైనది కాదని, ఐక్యతను కాపాడాలని వారన్నారు. ఆవిధానాల్లో భాగంగానే రెంజర్ల రాజేష్ ఇంటిపైన కూడా దాడి జరిగింది తెలిపారు. లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు ప్రజలు ప్రజాస్వామిక వాదులు కలిసి రావాలని అన్నారు. సమావేశంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మిర్దాపలి విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలుర సెలక్షన్స్ పోటీల్లో మండలంలోని జడ్పీహెచ్ఎస్ మిర్దాపల్లి పాఠశాలకు చెందిన బాలురు నలుగురు సెలెక్ట్ అయినట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేష్ మంగళవారం తెలిపారు. హర్షిత్, మణికంఠ, మల్లికార్జున్, లవన్ ఎంపిక అయ్యారని అ న్నారు. ఈ విద్యార్థులు ఈనెల 20 నుండి 23 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

ప్రధానోపాధ్యాయులు కుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హాకిలో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం సంతోషకరమని, రాష్ట్రస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరచాలని అభినందించారు. క్రీడాకారులను సర్పంచ్ మధు వర్మ ఎస్ఎంసి చైర్మన్, వీడీసీ సభ్యులు ఉపాధ్యాయ బృందం అభినందించారు..

కోటగిరి హెచ్ఎం, ఎంఈఓలను తొలగించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కోటగిరి ప్రభుత్వ హైస్కూల్లో పనిచేస్తున్న హెచ్ఎం, మండల ఎంఇఓపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జనవరి 2న కోటగిరి ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన ఘటనల్లో ప్రత్యక్షంగా హెచ్ఎం, ఎంఈవోలు పాల్గొన్నారని, ఘటనను నివారించ కుండా టెంపుల్ వరకు ర్యాలీలో పాల్గొన్నారని అన్నారు. (ప్రభుత్వ విద్యా సంస్థల్లో మత సంఘాల జోక్యాన్ని నివారించాలని, ప్రభుత్వ ఉద్యోగులపై దాడిని నివారించేందుకు ప్రత్యేక జీవోలు తీసుకురావాలని, దళిత ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. మల్లికార్జున్‌కు కోటగిరి బీజేపీ భజరంగ్ దళ్ వారితో ప్రాణాపాయం ఉన్నందున ఆయన కోరుకున్న ప్రదేశంలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విఘ్నేష్ , బివిఎం రాష్ట్ర అధ్యక్షుడు బట్టు శ్రీధర్, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దేశెట్టి సాయిరెడ్డి, సునీల్, సుబోద్, విశాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 51మంది ఆడపడుచులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడపడుచుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మీ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఈ పథకం కింద ఒక్కొక్క లబ్ధిదారుకు రూ. లక్ష ఒక వంద పదహారు రూపాయలు చొప్పున అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు సక్కారం అశోక్, దయ్య దేవయ్య, నునావత్ లష్కర్, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, లకావత్ గంగాధర్, ఏశాల నర్సయ్య, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షులు బోడ దేవేందర్, మండల కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మోహన్ నాయక్, హస కొత్తూరు గ్రామ శాఖ అధ్యక్షులు తెడ్డు కిరీటి, తదితరులు పాల్గొన్నారు.

కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్‌కు సన్మానం



కొలిప్యాక్ సింగిల్‌విండో చైర్మన్‌ను సన్మానిస్తున్న అర్గుల్‌విండో పాలకవర్గం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలం కొలిప్యాక్ సింగిల్‌విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్‌ను అర్గుల్ సింగిల్ విండో పాలకవర్గం శాలువాతో సన్మానించారు. అర్గుల్ సింగిల్ విండో కార్యాలయంలో రైతు అవగాహన కార్యక్రమానికి నూతనంగా ఎన్నికైన కొలి ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, అర్గుల్ ఎంపీటీసీ జెడి అనిత చిన్నారెడ్డి, డైరెక్టరు, అధికారులు పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పనులు పరిశీలన

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పెద్దవాల్గోట్, సిరికొండ, హుస్సేన్ నగర్, గడ్కోల్ గ్రామాల్లో మన ఊరు మన బడి పనులను మండల ప్రత్యేక అధికారి, డీసీవో సింహాచలం సోమవారం పరిశీలించారు. పనులు అసంపూర్తిగా ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో పల్లె ప్రకృతి వనం పరిశీలించారు. మొక్కలకు నీరు అందించాలని సర్పంచ్ యెన్నం రాజారెడ్డికి సూచించారు. ఈయన వెంట ఎంపిడిఓ లక్ష్మీప్రసాద్,ఏపీవో పోశెట్టి,పంచాయతీ కార్యదర్శి ముగ్ధుమ్, టీఏ నర్సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ గణేష్, సిబ్బంది ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న డీసీవో సింహాచలం

ప్రజావ్యతిరేక పాలలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మాజీ విప్ ఈరవత్రి అనిల్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ విప్ ఈరవత్రి అనిల్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా జనవరి 26 నుండి దేశ వ్యాప్తంగా హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమం నిర్వహించనుందని అన్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేక పాలనను ప్రజల్లోకి తీసుకువెళదామని, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాప్రసాద్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు దేవరెడ్డి, నాయకులు సుంకెట రవి, ముస్కు మోహన్, జీవన్, స్వామి, దేవేంధర్, పెద్దిరెడ్డి రవి, సంజీవ్, వెంకట్ రెడ్డి, గణేష్, లింగారెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

- మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరు కలిసి కట్టుగా ఉండి విజయవంతం చేయాలని డీఆర్డీఏ, డీఆర్డీఓ పీడీ, మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోపిబాబు ఈధ్వర్యంలో మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాది హామీ సిబ్బందికి హరితహారం సంబంధించి అవెన్యూ ప్లాంటేషన్, గ్రామ పంచాయతీ లోని తెలంగాణా క్రీడా ప్రాంగణం, మన ఊరు మన బడి కార్యక్రమంతోపాటు త్వరలో చేపట్టబోయే కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహనా సదస్సు నిర్వహించి పలు సూచనలు సలహాలు అందజేశారు. సమావేశంలో ఎంపిఓ కిషన్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే నూతన భవనాన్ని ప్రారంభిస్తాం

సీపీ నాగరాజు



భవనాన్ని పరిశీలిస్తున్న సీసీ నాగరాజు

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ పోలీస్ స్టేషన్లో నూతన భవనాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు అన్నారు. త్వరలో ప్రారంభ మయ్యే నూతన భవనాన్ని ఆర్మూర్ ఏసిపి ప్రభాకర్ రావు, ఎస్సై గోపి, బాల్కొండ ఉప సర్పంచ్ వాహబ్‌లతో కలిసి మంగళవారం పరిశీ లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజా యిపై ఉక్కు పాదం మోపి, నిజామాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా నిలుపుతామన్నారు. అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీ నాగరాజు, ఆర్మూర్ ఏసిపి ప్రభాకర్ రావు, ఎస్సై గోపి, బాల్కొండ ఉప సర్పంచ్ వాహబ్, ఏఎస్సైలు రాజేశ్వర్ రెడ్డి, శంకర్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, షకీల్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆయిల్‌ఫాం సాగుతో మంచి ఆదాయం

- ఏడీఏ మల్లయ్య
- రాయితీని వినియోగించుకోవాలి
- జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-ముప్కాల్/జక్రాన్‌పల్లి

రెంజర్ల గ్రామ రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్ పామ్‌పంట సాగుపై రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన భీంగల్ ఏడీఏ మల్లయ్య మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయిల్ పామ్ పంట సాగుపై మండలస్థాయి ప్రజా ప్రతినిధులు, రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయిల్ ఫామ్ పంట సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని, కావున ప్రభుత్వం పెద్దఎత్తున ఆయిల్ పామ్ పంటసాగుకు రాయితీని సైతం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల రైతుబంధు సమితి అధ్యక్షులు మేడిపల్లి ముత్తన్న మాట్లాడుతూ... తను స్వయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్నాన,ఇ అంతర పంటల సాగుతో పాటు ప్రభుత్వం రాయితీని కూడా అందిస్తుండడంతో లాభసాటిగా ఉంటుందని అన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మండల రైతు బంధు కోఆర్డినేటర్ మేడిపల్లి ముత్తన్న, మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ఉద్యానవన అధికారి రోహిత్, గ్రామ కో- ఆర్డినేటర్ మహేందర్ రెడ్డి, ఏఈవోలు నిశికాంత్, సంధ్య, రెంజర్ల, నాగంపేట్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీని వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. అర్గుల్ గ్రామపంచాయతీలో ప్రజా ప్రతినిధులకు, అభ్యుదయ రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మధుసూదన్ రెడ్డి క్షేత్ర సందర్శన చేసి ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట సాగు ఆవశ్యకత, వాటి ప్రాముఖ్యత వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుంటూ ఆయిల్ ఫాం సాగు విస్తీర్ణం పెంచాల్సిందిగా రైతులను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంఛార్జి ఏడిఏ రాంబాబు, ఎంపీడీవో లక్ష్మణ్, అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, సీఈవో తిరుపతి రెడ్డి, కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్, అర్గుల్ ఎంపీటీసీ పెద్దోళ్ల అనిత-చిన్నారెడ్డి, ఏఈఓలు భాస్కర్ నాయక్, వెంకటేష్, శివ ప్రసాద్, సుభశ్యా, రైతులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పనులు పరిశీలన

నవతెలంగాణ-ముప్కాల్

వేంపల్లి గ్రామంలోని వైకుంఠ ధామం, డంపింగ్ యార్డ్, అవెన్యూ ప్లాంటేషన్, కంపోస్ట్ షెడ్, నర్సరీలతో పాటు ప్రాథమిక పాఠశాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న ప్రహరీ గోడ, మూత్రశాల పనులను డీఎల్పీవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. నర్సరీలో 12 వేల బ్యాగులు ఫిల్లింగ్ పూర్తి అయి సీడ్ విత్తడంతో సెక్రటరీ రాజ్యలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు. పంచాయతీకి ఆదాయం వచ్చేలా ఫ్లవర్ ప్లాంటేషన్ లో పులా మొక్కలు పెంచుతూ కృషి చేస్తున్న సర్పంచ్ కు సైతం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్క మల్లు బాయి గంగాధర్, పంచాయితీ రాజ్ ఏఈ ఆష్రిఫ్, సెక్రెటరీ రాజ్యలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ గణేష్, కారోబర్ కిషోర్ పాల్గొన్నారు..

నేడు జానకంపేట ఆలయంలో వేలం పాట

- ఆలయ కమిటీ చైర్మన్ పురం సాయిలు వెల్లడి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 21న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు పురం సాయిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజ సామగ్రి, నవధాన్యాలు విక్రయించుకోవడానికి పాల్గొనే వ్యక్తులు రూ.5వేలు, లడ్డు, పులిహొర, చిరు వ్యాపారాలు విక్రయించుకునే వ్యక్తులు రూ.5వేలు, సైకిల్ స్టాండ్ కోసం రూ.వేయి ముందుగా ఆలయంలో ధర్మకర్తలి మండలి సమక్షంలో నగదు చెల్లించాలని సూచించారు.

మోడల్ స్కూల్లో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

స్థానిక ఆదర్శ పాఠశాల ఎల్లారెడ్డి 2023-24 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశం పొందడానికి ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించనున్నట్టు, ఆరవ తరగతిలో 100 సీట్లను మెరిట్ ఆధారంగా భర్తీ చేయనున్నట్టు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఏడు నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 10.2.23 నుంచి 15.2.23 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, 16.4.23న మండల కేంద్రంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

కరడుగట్టిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్టు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత సంవత్సరం నవంబర్‌లో ఇందిరానగర్ కాలనీలో రూ.90వేల నగదు చోరీ జరిగింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. అందులో భాగంగా మంగళవారం రామారెడ్డి చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. బాన్సువాడ ప్రాంతానికి చెందిన దుండగుల ఎల్లప్ప అలియాస్ కాశీనాథ్‌గా గుర్తించారు. విచారణలో భాగంగా జిల్లా కేంద్రంలో ఓ వ్యాపారి ఇంట్లో 2లక్షలు, నాలుగు తులాల బంగారం దోచుకోవడంతో చోరీ జరిగిన ఆవేదనతో వ్యాపారి మృతిచెందినట్టు పోలీసులు గుర్తించారు. అలాగే కామారెడ్డికి చెందిన ఉప్పు రాములు అనే వ్యక్తిని కూడా అరెస్ట్ చేసి వీరిద్దరి వద్ద నుంచి రూ.2.20లక్షల నగదు, 4 తులాల బంగారం, 32, 50, 40 ఇంచెస్ గల టీవీలు, ఒక హోమ్ థియేటర్ స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఎల్లప్ప బాన్సువాడలో ఓ లైంగికదాడి కేసులో జైలుకు వెళ్లి వచ్చి కోర్టుకు వెళ్లకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. అలాగే ఇతనిపై 28 కేసులు ఉన్నాయి. 7నాన్ బెయిలబుల్ వారెంట్‌లు సైతం ఉన్నాయి.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

12న మైనార్టీ కార్పొరేషన్‌లో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-జుక్కల్

మైనార్టీ కార్పోరేషన్‌లో రాయితీపై స్వయం ఉపాధి పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు జనవరి 12న గురువారం జుక్కల్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్టు కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లండించారు. లబ్దిదారులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో సమయానికి హాజరుకావాలని సూచించారు.

శివాలయంలో దొంగతనం

- హుండీ మాయం

నవతెలంగాణ-కోటగిరి

మండలంలో నిత్యం ఏదో ఒక దేవాలయంలో దొంగతనం పరిపాటిగా మారింది. గ్రామానికి దూరంగా ఉన్న దేవాలయాల్లో దుండగులు దొంగతనానికి పాల్పడుతున్నారు. తాజాగా మంగళవారం ఎత్తొండ క్యాంపులోని నూతనంగా ఏర్పాటు చేసిన శివాలయం తలుపులు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

చైనీస్ మాంజా దారాన్ని విక్రయించొద్దు

నవతెలంగాణ-రామారెడ్డి

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కిరాణా, జనరల్ స్టోర్ యజమానులు చైనీస్ మాంజాదారాన్ని విక్రయించవద్దని, ఈ దారం ప్రమాదకరమైందని, నిషేధించబడిందని, ఎవరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అనిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు న్యాయం చేయాలి

- తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-రెంజల్

కామారెడ్డిలో మాస్టర్‌ప్లాన్‌తో రైతుల భూములు కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల రైతు సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రామచందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకులు పుట్టి నడిపి నాగన్న మాట్లాడుతూ.. చనిపోయిన రాములు కుటుంబానికి 25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పేరుతో, ఇండ్లస్థలాల కోసం పంట భూములను వినియోగిస్తే రాబోవు కాలంలో భూములు లేకుండా పోతాయన్నారు. ప్రభుత్వం వెంటనే కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌ను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల రైతు సంఘం నాయకులు గుమ్మల గంగాధర్, మండల కార్యదర్శి ఎస్కె నసీర్, స్థానిక నాయకులు గోపాల్, పోశెట్టి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

వరిపంటలో తడిపొడి విధానంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రజిత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ఇసాన్నపల్లి గ్రామంలో వరి పంటలో తడి పొడి విధానంపై పద్మపాని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్లస్టర్ కోఆర్డినేటర్ రజిత మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ.. వరి పంటలో తడి పొడి విధానంలో భాగంగా నీరు పెట్టడం, ఆర పెట్టడం ద్వారా నీటి వినియోగం తగ్గడంతో పాటు నీటి సామర్థ్యం పెరుగుతుందని, అంతేకాకుండా వాతావరణంలో ప్రమాదకర కాలుష్యకారకమైన మిథేన్ వాయువు విడుదల కూడా ఈ పద్ధతిలో తగ్గుతుందని వివరించారు. ఈ విధానంలో వరి సాగు చేయడం ద్వారా వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది చేను కింద పడిపోదని, చీడపీడలు, దోమపోటు ఉధృతి తక్కువగా ఉంటుందని రైతులకు తగుసూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిసె రాములు, వైస్ ఎంపీపీ యాదగిరి, ఉప సర్పంచ్ పెంటమ్మ, రైతుబంధు కన్వీనర్ రాములు, ఏఈఓ ఆనంద్, మండల కోఆర్డినేటర్ రవికుమార్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు క్యాలెండర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్/భిక్కనూర్

బీసీ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, సాప శివరాములు, రాష్ట్ర కార్యదర్శి ఉప్పునూతుల నాగరాజ్‌గౌడ్, సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు పళ్ళ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు మారోజు మోహనాచారి, కుమ్మరి నరేష్, యువజన ప్రధాన కార్యదర్శి వడ్ల సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జొన్నల రమేష్, మండలాధ్యక్షులు గొడుగు అంజనేయులు, తాడ్వాయి మండల గౌరవ అధ్యక్షుడు శ్రీధర్ రావ్, ఎస్.దయాకర్, నాయకులు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సహకార శాఖ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

కామారెడ్డి జిల్లా తెలంగాణ సహకార శాఖ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల క్యాలెండర్‌ను స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా సహకార అధికారిని వసంతి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.భూమయ్య, ప్రశాంత్‌రెడ్డి, కృష్ణవేణి, శ్రీనివాస్, రమేష్, శ్రవణ్‌కుమార్, నరసింహులు, సృజన్, రాధిక, కరుణాకర్‌రెడ్డి, సురేష్, లక్ష్మీనారాయణ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ..

భిక్కనూర్ : మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ తిరుపయ్య, ఎస్ఐ ఆనంద్‌గౌడ్ ఆర్టీఐ ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సరపు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల జిల్లా అధ్యక్షుడు కలీం, వైస్ ప్రెసిడెంట్ ఎండి ఖలీలుల్లా, మండల అధ్యక్షుడు సమీద్, మండల ఉపాధ్యక్షుడు వడ్లూరి కిరణ్, సభ్యులు అరుణ్, జాహిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా యువజన అధ్యక్షుడు వెంకటేష్, ఎంపీటీసీ సాయగౌడ్, ప్రమోద్‌రావు, సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

- బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామ సమీపంలో మంగళవారం పీడీఎస్ బియ్యంతో వస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్టు బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన బోధన్ రూరల్ సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు జాడిజమాల్‌పూర్ సమీపంలో వస్తున్న రెండు లారీలను తనిఖీ చేయగా.. అందులో 500 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ లారీలు నాందేడ్‌కు చెందినవి.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

కాగా డ్రైవర్ కలీం, మరో వ్యక్తి రాజారాం, లేబర్ మహమ్మద్ ఇక్బాల్‌లను అరెస్టు చేసి లారీలను సీజ్ చేశారు. కాగా పట్టుబడిన పీడీఎస్ బియ్యం విలువ రూ.16లక్షలు ఉంటుంది. సీజ్ చేసిన లారీల విలువ సుమారు రూ.10లక్షలు ఉంటుంది. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీధర్, రూరల్ ఎస్ఐ సందీప్, సిబ్బంది లింగమయ్య, చందులాల్, అనిల్ కుమార్, రామచందర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సుధాకర్ ఉన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

- ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుందని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ శ్రీనివాసులు హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజమని, క్రీడాకారుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని యువకులు వెలికితీయాలని అన్నారు. ఓటమి చెందానని నిరాశపడకుండా ముందుకు సాగాలని అన్నారు. క్రీడలతో యువతకు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం, శరీర దృఢత్వం పెరుగుతుందని చెప్పారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతగా నిలిచిన జట్లకు జాతీయ యువజన దినోత్సవం నాడు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్, నాగిరెడ్డిపేట్ ఎస్ఐ ఆంజనేయులు, లింగంపేట్, గాంధారి ఎస్ఐలు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ

రాష్ట్రంలో నిరంకుశ పాలన

- ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి
- 'హాత్ సే హాత్ జోడో' సన్నాహక సమావేశం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని, ఈ నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పించేది కాంగ్రెస్ మాత్రమేనని ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్ర సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశానుసారం ఈ నెల 26వ తేదీ నుంచి రాహుల్‌గాంధీ నిర్వహించిన రాహుల్ జోడో పాద యాత్రకు మద్దతుగా రాష్ట్రంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ పాదయాత్ర రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలను కలుపుతూ నిర్వహించనున్నట్టు వివరించారు. దీనికి అనుసంధానంగా ప్రతి నియోజకవర్గంలోనూ రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర సందేశాన్ని ప్రతి గ్రామానికి వివరించాలన్న ఉద్దేశంతో పల్లె పల్లెకు గడపగడపకు రాహుల్ గాంధీ సందేశాన్ని తెలియ జేయాలని టీపీసీసీ ఆదేశించిందని దీనిలో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏ విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు అందరూ కలిసి ఈ కార్యక్రమంలో చర్చించినట్టు తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిన బీఆర్ఎస్ తీరును ప్రజలకు తీసుకెళ్లి కాంగ్రెస్ శ్రేణులు ప్రతి ఇంటికి వెళ్లి చేయి కలిపి వారికి వివరించాలని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాగయ్య, వైస్ ఎంపీపీ నర్సింలు, ఎంపీటీసీ బాల్‌రాజ్, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పరందాములు, సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, ఆఫీజ్, గోవిందనాయక్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


బోధన్ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి


ఎడపల్లి : బాలికల గురుకులంలో..

నవతెలంగాణ-బోధన్/ఎడపల్లి

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని పెంటకలాన్ గ్రామంలో సాలూర మండల కేంద్రంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు మంగళవారం ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా హాజరై ముగ్గుల పోటీలను తిలకించారు. ఈ ముగ్గుల పోటీలో విజేతలుగా గెలుపొందిన వారికి ఆమె బహుమతులను ప్రదానం చేశారు. సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఎంపీపీ బుద్దె సావిత్రి, రైతుబంధు మాజీ మండలాధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, తల్వేద రమణ, ఎంపీటీసీ సవిత, మార్కెట్ కమిటీ చైర్మన్ వీఆర్ దేశాయి, మాజీ మున్సిపల్ చైర్మన్ సునీతా దేశాయి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాలూర షకీల్, సర్పంచ్‌లు బుయ్యన్, చంద్రకళ, కృష్ణప్రసాద్, నానా పటేల్, నాగయ్య, ఎస్‌కే.ఆమీర్, సహకార సంఘం అధ్యక్షులు అల్లె జనార్దన్ పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల పరిధిలోగల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో సంక్రాంతి సందర్భంగా ముగ్గులను అలంకరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా బేగం హాజరై ముగ్గులను పరిశీలించారు. అలాగే ఎమ్మెల్యే సతీమణి ఫాతిమా అయేషా బేగంను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, బాబుకిరాన్, గౌతమి, భావన, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'కంటివెలుగు 2'పై అవగాహన


మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కంటి వెలుగు 2 కార్యక్రమంపై వైద్య సిబ్బందికి అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి సుదర్శనం, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ అమర్ సింగ్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు పైబడిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వెలుగు 2 కార్యక్రమం విజయవంతం చేయడానికి గ్రామ కార్యదర్శులు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రాములు, ఎంపీడీవో శంకర్, రెంజల్ వైద్యాధికారి వినయ్‌కుమార్, ఎంఈఓ గణేష్ రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది కరిపే రవీందర్, గోవర్ధన్, ఆప్తాలమిక్ జనార్దన్, వైద్య సిబ్బంది గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు 2 కార్యక్రమంలో భాగంగా ఏర్పాట్లను నోడల్ అధికారి డాక్టర్ అమర్ సింగ్, జిల్లా వైద్యాధికారి సుదర్శనం పరిశీలించారు.

నూతన మండలాల్లో అభివృద్ధి పనులు చేస్తాం

- టీఆర్ఎస్ బాన్సువాడ ఇంచార్జ్ సురేందర్‌రెడ్డి


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలోని నూతన మండలాలలో పరిధిలో గల గ్రామాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని బాన్సువాడ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మోస్రా మండలంలోని చింతకుంట గ్రామంలో రూ.20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఐదు లక్షల రూపాయలతో నిర్మాణం చేసిన మైనార్టీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో నియోజకవర్గంలోని మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. చింతకుంట గ్రామంలో చుట్టుపక్కల ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీరాములు, సర్పంచ్ విమల లింగయ్య, సున్నం భూమయ్య, వైస్ ఎంపీపీ కత్తి శంకర్, కోఆప్షన్‌మెంబర్ కరీం గౌడ్, సర్పంచ్ నరేందర్‌రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని పేదలు సద్విని యోగం చేసుకోవాలని ఎంపీఓ బ్రహ్మం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ధనలక్ష్మి సీఎస్‌సీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారందరూ ఆయుష్మాన్ భారత్ యోజన పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని, చేసుకున్న వారందరూ కేవైసీ పత్రాలను భద్రంగా దాచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం నమోదు చేసుకున్న లబ్దిదారులకు కేవైసీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, మండలాధ్యక్షుడు అభినయ్, పట్టణ అధ్యక్షులు వడ్ల శివ, సాయిరెడ్డి, సూర్యకాంత్ పటేల్, మీసేవ నిర్వాహకుడు సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పత్రాలు అందజేస్తున్న అధికారులు

మొక్కలను సంరక్షించాలి

నవతెలంగాణ-వర్ని

గ్రామాల్లోని ప్రతి చోట నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి పంచాయతీ సెక్రెటరీపైన ఉందని మండల ప్రత్యేక అధికారి మధుసూదన్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో అపరిశుభ్రత ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఇలాంటి పరిస్థితులు లేకుండా చూడాలని పంచాయతీ సెక్రెటరీలకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో మొక్కల సంరక్షణతో కృషి చేయాలన్నారు. పరిశుభ్రతను పాటించడానికి ట్రాక్టర్లను ఉపయోగించుకొని గల్లీగల్లీ నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌లో వేసే విధంగా చూడాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఏపీవో మంజుల, ఎంపీఓ చందర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

సేవే పరమావధిగా భావిస్తూ నిత్యము పేదలకు సేవ చేయడంలో ఆదినారాయణరావు ముందంజలో ఉన్నారని నిజామాబాద్ వర్తక సంఘం మాజీ అధ్యక్షులు పుట్టా కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం ఎత్తొండ పాఠశాలలో 42 మంది పేదలకు డాక్టర్ సుధాకర్ సహకారంతో మండల ఆదినారాయణరావు దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు గంగరాజు, జిల్లా నాయకులు శానం సాయిలు, పాఠశాల చైర్మన్ పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

క్రీడా ప్రాంగణం పనులు పూర్తి చేయాలి

- ఎంపీఓ ప్రభాకర్‌చారి

నవతెలంగాణ-లింగంపేట్

క్రీడా ప్రాంగణం పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీఓ ప్రభాచారి సూచించారు. మంగళవారం మండలంలోని నల్లమడుగు పెద్ద తండా గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణం చేపడుతున్న క్రీడా ప్రాంగణాన్ని, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్రీడా ప్రాంగణం తప్పనిసరి అన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. నర్సరీలో జూన్ జూలై మాసానికి మొక్కల పెంపకం కోసం ఎర్ర మట్టిని ఉపయోగించాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీలో ఇప్పటివరకు చేపట్టిన పనుల గురించి కార్యదర్శి ప్రశాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వార్డ్ సభ్యులు తదితరులున్నారు.

కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తోన్న కేంద్రం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/వర్ని

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య విమర్శించారు. ఈనెల 18 నుంచి 22 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరిగే సీఐటీయూ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ప్రారంభ సూచికగా నిజామాబాద్ సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ కార్మికులకు అనుకూలంగా ఉండే చట్టాలను తొలగిస్తుందన్నారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని వీటిని ఎండగట్టడం కోసం ఈ మహాసభలు వేదికగా మారుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేష్, శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి నూర్జహాన్, జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు, గోవర్ధన్, స్వర్ణ, ఈవీఎల్ నారాయణ, మోహన్‌రావు, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ప లింగం పాల్గొన్నారు.


నిజామాబాద్‌సిటీ : సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్.వీరయ్య


రుద్రూర్‌లో..

రుద్రూర్‌లో సీఐటీయూ జెండావిష్కరణ..

వర్ని : జాతీయ 17వ మహాసభల సందర్భంగా రుద్రూర్ మండల కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నేసాబ్ మండల కన్వీనర్ రఫీ ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనవరి 18 నుంచి 22వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో సీఐటీయూ జాతీయ మహా సభలు ఉంటాయని ఈ సభలకు ప్రధాన సీఐటీయూ నాయకులు పాల్గొంటారని ఈ సభలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నవీన్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-మాక్లూర్

ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై యాదగిరి గౌడ్ వివరాల ప్రకారం...మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన అరుణ్ కుమార్ గౌడ్(30) మహిళ సంఘాల్లో, ఇతర చోట్ల లోన్లు తీసుకున్నాడు. వాటిని కట్టలేక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో సోమవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతర లోన్లు కట్టలేక ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

కారు దగ్ధం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని రాంపూర్‌కు వెళ్ళే రోడ్ మార్గం మధ్యలో సోమవారం రాత్రి 10 గంటలకు టాటా జెస్ట్ కారు దగ్ధమయింది. ఈకారులో ఆర్మూర్ నుండి నందిపేట్‌కు ముగ్గురు యువకలు వెళ్తున్నారు. కారు నుండి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఘటన జరిగిన వెంటనే అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

గంజాయి నిందితులు అరెస్ట్

నవతెలంగాణ-మోర్తాడ్

మండలం వడ్యాట్ గ్రామ శివారులో గంజాయి విక్రయాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఇద్దరిని పట్టుకున్నట్లు భీంగల్ సిఐ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్యాట్ గ్రామానికి చెందిన బొబ్బిలి నవీన్, మహమ్మద్ అష్రఫ్ నిర్మల్ జిల్లా బైంసా ప్రాంతం నుండి గంజాయి తీసుకువచ్చి విక్రయాలు జరుగుతున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తూ కేజీ గంజాయి తీసుకువచ్చి చిన్నచిన్న ప్యాకెట్లను తయారు చేస్తూ విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. యువతపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని అన్నారు. యువత చెడు మార్గాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు పర్యవేక్షణ ఉండాలని అన్నారు. అర్ధరాత్రి వరకు ఇంటికి రాని యువతపై తల్లిదండ్రులు పర్యవేక్షిస్తూ తప్పుడు మార్గాలకు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. నిందితుల నుండి రెండు సెల్ ఫోన్లు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపించనున్నట్లు చెప్పారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐ ముత్యం రాజుకు, టీం సభ్యులకు అభినందనలు తెలిపారు.

విగ్రహ ప్రతిష్టాపనకు రావాలని ఆహ్వానం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలో పోచమ్మ గుడి నిర్మాణంలో భాగంగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి రావాలని ఆ గ్రామపెద్దలు ఎమ్మెల్యే హన్మంత్‌షిండేను మంగళవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్ర మంలో సర్పంచ్, ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్ అనిల్, నాయకులు బాబు పటేల్ తదితరులు పాల్గొన్నారు.


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఈకేవైసీ తప్పనిసరి

నవతెలంగాణ-తాడ్వాయి

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కోసం ఈ కేవైసీని రైతులందరూ తప్పకుండా చేయించుకోవాలని వ్యవసాయ సంచాలకులు రత్న సూచించారు. మంగళవారం మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో యాసంగి పంటలపై అవగాహన కల్పించారు. అలాగే క్షేత్ర సందర్శన చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యాసంగి వరి పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కేవైసీ చేయించుకోకుంటే 13వ విడత పీఎం కిసాన్ డబ్బులు అకౌంట్‌లో జమకావని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి రజిత, ఎంపీటీసీ వెంకటరెడ్డి, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ వెంకట్ రావు, సొసైటీ వైస్‌చైర్మెన్ ధర్మారెడ్డి రైతులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

- 2వ ఏఎన్‌ఎంల వినతి

నవతెలంగాణ-భిక్కనూర్

ఈనెల 12వ తేదీన హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాలో పాల్గొనుటకు అనుమతి ఇవ్వాలని భిక్కనూర్ మండలంలోని 2వ ఏఎన్‌ఎంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు ఆదర్శ్, హేలీమాకు వినతిపత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా 2వ ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ.. గత 14 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నా.. ఇంతవరకూ రెగ్యులరైజ్ చేయలేదని, ప్రభుత్వాలు మారిన పని భారం పెంచుతూ పోతుందే తప్పా, సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోలేదని అన్నారు. ఎటువంటి పరీక్షలు, షరతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 16లో 2వ ఏఎన్‌ఎంలను కూడా చేర్చి రెగ్యూలర్ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలోకి పంట సాగు నమోదు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డిలో ఏఈఓ రాకేష్ రైతుల పంట పొలాల్లోకి వెళ్లి పంట సాగు వివరాలను మంగళవారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. ప్రతి రైతు సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ నమోదు చేసుకోకపోతే ధాన్యం విక్రయించే సమయంలో ఇబ్బందులు ఏర్పడతాయని సూచించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హిందీ భాషా దినోత్సవం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ హిందీ భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, ఉపన్యాస, బాల్‌గీత్ పోటీలను నిర్వహించారు. అనంతరం హిందీ భాష ఉపాధ్యాయులు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే హిందీ భాషకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, జనవరి 10 నాడు హిందీ దివాస్‌ను విశ్వ హిందీ భాషా దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లింబాద్రి, ఉపాధ్యాయులు కిషన్, రాజేష్, రవి, విజయనిర్మల, రాజ్యలక్ష్మి, సౌందర్య, కల్పన, ప్రవీణ, సత్యనారాయణ, కోటేశ్వరి, మల్లేశం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కూలీలను పెంచండి

నవతెలంగాణ-రాజంపేట్

ఉపాధి కూలీలు పెంచి ఉపాధి పనులు నిర్వహించాలని ఎంపీడీవో బాలకిషన్ పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ , గ్రామపంచాయతీ పనులపై పంచాయతీ సెక్రటరీలతో ఎంపీఓ ప్రవీణ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిరన్వహించారు. సమావేశంలో టీఏలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రూ.5వేల చెక్కు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

అంగర్గా ఫారం గ్రామంలో విజయడెయిరీ డీడీ నందకుమారి విజయ పాల కేంద్రంలో పాలు పోసే ఉత్పత్తిదారుని కుటుంబంలోని బాధితుడికి విజయ డెయిరీ తరపున వైకుంఠధామం పథకం కింద రూ.5.వేలను ఆర్థిక సహాయం మంగళవారంఅందజేశారు. సర్పంచ్ ఎజాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని దేమీకలాన్ గ్రామంలో రూ.35 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ పౌరాజు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యత రహితంగా సీసీ రోడ్డు పనులు నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులు పరిశీలన


నవతెలంగాణ-కోటగిరి

మండల పరిధిలోని కోటగిరి, పోతంగల్, అడ్కస్‌పల్లి, జల్లపల్లి, కొడిచర్ల, దేవునిగుట్ట తాండ, గ్రామ పంచాయతీలలో అవెన్యూ ప్లాంటేషన్, మన ఊరు మన బడి, క్రీడా ప్రాంగణం స్థలం, మినీ బృహత్ పల్లె ప్రకృతి వనాలను మండల ప్రత్యేక అధికారి రమేష్ మంగళవారం పరిశీలించారు. అనంతరం కోటగిరి మండల కార్యాలయంలో కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో మారుతి, ఏపీఓ రమణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి అనిల్ పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి చింతకుంట శ్రీనివాస్‌ను ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్ అమ్మ చింతకుంట భూదేవి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఈరవత్రి అనిల్ ఉప్లూర్‌లో శ్రీనివాస్ ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కురి దేవేందర్, చింతకుంట శ్రీనివాస్, నాయకులు సుంకట శ్రీనివాస్, సల్లూరి గణేష్ గౌడ్, తదితరులున్నారు.


నాయకుడిని పరామర్శిస్తున్న అనిల్

ప్రజల చైతన్యం కోసం.. మీడియా

- నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణలో సీఐ

నవతెలంగాణ-భిక్కనూర్/తాడ్వాయి

ప్రజల చైతన్యం కోసం మీడియా పనిచేస్తుందని సీఐ తిరుపయ్య, ఎస్ఐ ఆనంద్‌గౌడ్ అన్నారు. భిక్కనూర్ మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న మీడియా సమాజంలో మార్పుకు, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో భిక్కనూర్ నవతెలంగాణ జర్నలిస్ట్ శ్యాంసుందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


భిక్కనూర్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐ, ఎస్ఐ


తాడ్వాయి : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్

నిజాన్ని నిర్భయంగా రాయాలి : ఎస్ఐ

తాడ్వాయి : పత్రికలు నిజాన్ని నిర్భయంగా రాయాలని ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన నవతెలంగాణ-2023 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పత్రికలు సమాజ మార్పు కోసం పనిచేస్తాయని, బడుగు బలహీన వర్గాల కోసం అనునిత్యం 'నవతెలంగాణ' కథనాలు ప్రచురించడంపై ఆయన అభినందించారు. కార్యక్రమంలో నవతెలంగాణ విలేకరి సాయిబాబా, డివిజన్ ఇంచార్జ్ మెతుకు నరేష్ పోలీస్ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

సమయానికి మొక్కలను సిద్ధం చేయాలి

- ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

హరితహారం సమయానికి మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, జంగమాయిపల్లి, మల్కాపూర్, మత్తమాల్, రుద్రారం గ్రామాలలో నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పట్ల సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జూన్ మాసంలో నిర్వహించనున్న హరితహారం కార్యక్రమానికి మొక్కలను అందించడానికి సిద్ధం చేయాలన్నారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుందని నర్సరీల్లో మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళల్లో నీరు పోసి సంరక్షించాలన్నారు. అనంతరం పలు గ్రామాలలో గ్రామీణ క్రీడాప్రాంగణాలను ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

దొంగతనాల కేసులో నిందితుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ నాగరాజు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో గత డిసెంబర్ 30, ఈనెల 1న పగటిపూట బంగారు షాపుల తాళాలు పగలగొట్టి బంగారం, వెండి ఆభరణాలను దొంగలించిన నిందితులను అరెస్టు చేసినట్టు పోలీస్ కమిషనర్ కె ఆర్ నాగరాజు తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో నిందితులు దొంగలించిన సొత్తుతో పారిపోతుండగా ఏసిపి ప్రభాకర్ రావు పర్యవేక్షణలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం పట్టుకున్నట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ఏ టు నిందితుడు రామ్‌కేష్ గుప్తాతోపాటు ఒక బాల నేరస్తుడిని పట్టుకుని విచారించగా దొంగతనాలు చేసినట్టు ఒప్పుకున్నారని అన్నారు. ఏ వన్ నిందితుడు యామాజీ పరారీలో ఉన్నాడని తెలిపారు. వారి వద్ద నుండి 180 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నాడని, వీట్కి విలువ 9 లక్షలు ఉంటుందని తెలిపారు. ఏ వన్ నిందితుడు మహారాష్ట్రకు పారిపోయాడని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. దొంగతనం కేసును శోధించిన ఏసీపీ ప్రభాకర్ రావు, ఎస్‌హెచ్‌ఓ సురేష్‌బాబు, ఎస్సై రాము, ఏఎస్ఐ షేక్‌గఫర్, కానిస్టేబుళ్లు గంగా ప్రసాద్, ప్రసాద్‌ను అభినందించి వీరికి రివార్డులు ప్రదానం చేశారు.

మొక్కలతోనే మనుగడ

- పీడీ చందర్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మొక్కలతోనే మనుగడ ముడిపడి ఉందని, మొక్కలు లేని చోట విరివిగా నాటించి వాటిని సంరక్షించాలని డీఆర్‌డీఏ, డీఆర్‌డీఓ పీడీ, మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవనగర్ క్యాంప్‌లో పల్లె ప్రగతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, నర్సరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పల్లె ప్రగతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, నర్సరీ బాగుందని, మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. అయన వెంట ఎంపిడిఓ గోపి బాబు, ఇంచార్జీ ఎంపిఓ కిషన్ రావ్, బిఆర్ఎస్ నాయకులు మహమ్మద్ యూసుఫ్, ఉపసర్పంచ్ బుచ్చమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీ వాణి, టెక్నికల్ అసిస్టెంట్ సంపూర్ణ, వార్డ్ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.


మొక్కను నాటుతున్న పీడీ

ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా నరేష్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మన్నె క్రిష్ణ ఎల్లారెడ్డి మండల ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఎల్లారెడ్డి మండల అధ్యక్షులుగా పికె నరేష్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన నరేష్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న నిజమైన దళితులకు మాత్రమే రిజర్వేషన్ ఫలితాలు అందేలా చూస్తామని తెలిపారు. కుర్మ సాయిబాబా పాల్గొన్నారు.

పేరు ప్రఖ్యాతలు సాధించాలి

- జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని వెంగల్‌పాడ్ తండాకు చెందిన లవుడ్య అరవింద్ జాతీయ స్థాయి సీనియర్ హాకీ పోటీలకు ఎంపికయ్యారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఆర్థిక ఇబ్బందుల వలన వెళ్ళలేక పోతున్నాడు. ఈ విషయం జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ దృష్టికి తండాకు చెందిన బిఆర్ఎస్ నాయకులు తీసుకువచ్చారు. ప్రతిభ ఉన్న వారు ఆగిపోవద్దని బాజిరెడ్డి జగన్ మోహన్ హాకీ కిట్టుకోసం 16 వేల రూపాయలు, ట్రాక్‌షూట్ కొనుగోలు చేయడానికి తనవంతు ఆర్థిక సహాయం చేశారు. జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. క్రీడాకారులకు ఎల్లప్పుడూ తనవంతు చేయూత అందజేస్తునే ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో రైతు సమితి అధ్యక్షుడు తిరుమల్, రూరల్ నియోజకవర్గ కన్వీనర్ మల్లెల సాయి చరణ్, విద్యార్థి కన్వీనర్ రాము, మండల ల కన్వీనర్ లు గంగన్న, భాస్కర్, మహిపాల్, యూత్ కో కన్వీనర్ విక్కీ తోపాటు తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలో క్రీడాకారులకు కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కేసీఆర్ సేవాదళ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి రమణారావు, ప్రధాన కార్యదర్శి ఏటీఎస్ శ్రీనివాస్ కోరారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల క్రీడాకారులకు పార్లమెంటు స్థాయి కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు ఈ నెలలో 10, 11, 12న పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులు, కోచ్‌ల నిర్వాహకులకు భోజన సదుపాయంతోపాటు వసతి సౌకర్యం కల్పించడం జరిగిందని అన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 50వేల, రెండవ బహుమతిగా 30వేలు, మూడవ బహుమతిగా పదివేల నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే, తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ హాజరవుతారని వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు క్రీడాపోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసమని తెలిపారు. సమావేశంలో సాయి గౌడ్, రాకేష్ చంద్ర, నీలం శేఖర్ రాజు, జీవన్ ఒడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేసీఆర్ సేవాదల్ నాయకులు

కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దాసు కోరారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల నాన్‌టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ కేజీబీవీ ఆధ్వర్యంలో ఈనెల 11న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దాసు పిలుపునిచ్చారు. మహాసభలు సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 475 పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని వెంటనే పర్మినెంట్ చేయాలని దాసు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ ఉద్యోగాలు ప్రకటిస్తామని ఇచ్చిన మాటను కేసీఆర్ తప్పారని అన్నారు. వెంటనే 11,103 మందిని క్రమబద్ధీకరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అదనపు పనిభారం పెరిగినా వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆయన తెలిపారు. రాష్ట్ర మహాసభకు వర్కర్స్ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఎండి కాజా మొయినుద్దీన్, సుంకర శ్రీనువాసు, పద్మ, భారతి బాలయ్య, ఆశన్న, కేజీబీవీ ఉద్యోగులు, సిబ్బంది కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రముఖ పారిశ్రామిక వేత్త వసంత టూల్స్ అండ్ క్రాఫ్ట్ అధినేత, విద్యాదాత చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు దయానంద రెడ్డి మంగళవారం డిచ్ పల్లి మండలంలోని మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు క్రీడా దుస్తులు, క్రీడాపరికరాలను అందజేసినట్టు ప్రధానోపాధ్యాయులు రాఘవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ తేలు గణేష్ పాల్గొని క్రీడా వస్తువులను క్రీడాకారులకు అందజేశారు. ఉమ్మడి జిల్లా నుండి 11 పాఠశాలలను ఎంపిక చేసిన వాటిలో మిట్టపల్లి పాఠశాలను ఎంపిక చేయడం హర్షనీయమని అన్నారు. క్రీడా వస్తువులను అందించినందుకు గాను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో క్రీడాకారులను తీర్చి దిద్దడానికి ఈ కార్యక్రమం మంచి ప్రోత్సాహకరంగా ఉంటుందని అన్నారు. గ్రామం నుంచి రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొనేలా ముమ్ముందు కూడా ఇలాంటి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల గంగాధర్, ఉప సర్పంచ్ కిషన్, గ్రామ పెద్దలు గోపు రాజేశ్వర్, గంగా రత్నం , వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగా మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల పొట్టగొట్టొద్దు

● ఏఐటీయూసీ

నవతెలంగాణ-ఆర్మూర్

ఆటో డ్రైవర్ల పొట్ట గొట్టడం అన్యాయమని, డిపో మేనేజర్ తీరు మార్చుకోవాలని, లేకుంటే వందలాది ఆటోలతో డిపోను ముట్టడిస్తామని ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు అన్నారు. పట్టణంలోని జావీద్ భాయ్ మినిస్టేడియంలో ప్యాసింజర్ ఆటో డ్రైవర్ల ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రభాకర్ రావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలపై ఆధారపడకుండా స్వయంశక్తితో ఆటోలను నడుపుకుంటు వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటుంటే ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్టీవోనును వెంటబెట్టుకుని ఆటోలను ఆపుతూ ఆటోల్లోని ప్రయాణికులను బస్సుల్లో ఎక్కిస్తు ఆటోలను సీజ్ చేయిస్తూ వారి పొట్టలు కొట్టడం ఏంటని అన్నారు. డీఎం తీరు మార్చుకోకుంటే ఆటో డ్రైవర్లు అంటే ఏంటో చూపిస్తామని, ఇలాగే కొనసాగితే వందలాది ఆటోలతో డిపోను ముట్టడిస్తామని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఏసీపీని కోరారు కార్యక్రమంలో హాలిమ్ శ్రీనివాస్, సదానందం, రాజేశ్వర్, లజార్ సిరాజొద్దీన్, తాజోద్దీన్, లగ్గాల నర్సయ్య, నజీర్ రాజు, గంగాధర్, పీర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పార్కులవల్ల మానసిక ప్రశాంతత

● మేయర్ దండు నీతూ కిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని 6వ డివిజన్ న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో చేపడుతున్న యాదాద్రి మోడల్ పార్క్ పనులను 25వ డివిజన్ కోటగల్లిలోని పట్టణ ప్రకృతి వనాలలో జరుగుతున్న పనులను మేయర్ స్థానిక కార్పొరేటతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. పని ఒత్తిడిలో మానసికంగా శారీరకంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆహ్లాదకరమైన పరిసరాలను అందించాలని అన్నారు. ప్రతి డివిజన్‌కు ఒక పార్క్ ఉండే విధంగా ఎమ్మెల్యే గణేష్ గుప్త కృషి చేస్తున్నారని, ప్రజలకు సెలవు రోజుల్లో పార్కులలో కాసేపు సమయాన్ని గడిపే విధంగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. చిన్న పిల్లలకు ప్రతి పార్కులో ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమా రాణి శ్రీనివాస్, ధర్మపురి మున్సిపల్ ఇంజినీర్ ఇనాయత్, కరీం, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో హిందీ దివస్

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో హిందీ దివస్ మంగళవారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ముగ్గులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వివిధ అంశాలపై విద్యార్థినిలు ప్రసంగించారు. ముఖ్యంగా హిందీ భాష ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయురాలు సంతోషిరాణి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, నాయకుడు పద్మ కిషన్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ముస్కు నర్సయ్య, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేందర్, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ జి.వినోద, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపాలి

● తహసీల్దార్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా మైదానంలో పది రోజులుగా జరుగుతున్న జిల్లా సీనియర్ మహిళల సాఫ్ట్ బాల్ శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిచ్ పల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. నిర్మల్ జిల్లా ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈనెల 11 నుండి 13 వరకు జరగనున్న 8వ రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపడానికి క్రీడాకారులు కృషి చేయాలన్నారు. సీనియర్ క్రీడాకారులనున ఆదర్శంగా తీసుకొని కోచ్ సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగాల్లో, ఉన్నత విద్యలో 2శాతం రిజర్వేషన్ కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ ముగింపు కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా డిచ్ పల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కచ్చకాయల గణేష్ పాల్గొని మాట్లాడారు. క్రీడల వల్ల శారీరకంగా మానసికంగా అభివృద్ధి చెందడంతోపాటు మంచి నాయకత్వ లక్షణాలు మెరుగుపడతా యన్నారు. జిల్లా సాఫ్ట్ బాల్ క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ పోటీల్లో రాణించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లూరి లత, రంజిత్, ఆకాడమీ కోచ్ వేముల మౌనిక పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

నవతెలంగాణ-సిరికొండ

మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విశ్వ హిందీ దివస్ ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాష లో కథలు చెప్పే పోటీ, పాటల పోటీ, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని విజేతలుగా నిలిచారు.

కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సతీష్ కుమార్ మాట్లాడుతూ హిందీ భాష మన దేశానికి చెందినది కావడం గర్వకారణమని, ప్రస్తుతం ప్రపంచములో అత్యధికులు ఉపయోగించే భాషల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో హిందీ నిలుస్తోందని అన్నారు. హిందీ భాషల్లో ప్రావీణ్యం లభించడంతో, యువతకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలైనా రైల్వే, తపాల, సినీ రంగం, బ్యాంకింగ్, రక్షణ, ఉపాధ్యాయ వృత్తుల్లో పలు రకాల సంస్థల్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. హిందీ భాషలో పదేళ్లుగా సేవలందిస్తూ ప్రచారం చేస్తున్న హిందీ ఉపాధ్యాయులు రాచర్ల గంగాధర్ ను సిబ్బంది అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్వానితులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, యూసుఫ్ ఖాన్,అన్నపూర్ణ, మోతిలాల్, రాచర్ల గంగాధర్, శైలజ, వెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్

జనవరి 5, 6 తేదీల్లో జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి అంతర పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2022-2023లో క్షత్రియ విద్యార్థులు ప్రతిభను చూపినట్టు కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ మంగళవారం తెలిపారు. నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో పన్నెండు కళాశాలలకు నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో క్షత్రియ విద్యార్థులు ప్రతిభను కనపరిచారు. ఖోఖో బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి లో హైదరాబాద్ లో నిర్వహించే పోటీలకు ఖోఖో జట్టు విన్నర్‌గా గ ఎంపికలి అయ్యారు.. ఈ సందర్భంగా క్షత్రియ యాజమాన్యం, సెక్రెటరీ, కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్ ప్రిన్సిపాల్ ఆరేకే పాండే, వైస్ ప్రిన్సిపాల్ బి. నరేందర్, పాలిటెక్నిక్ కోఆర్డినేటర్ వి.సుజిత్ కుమార్, ఇంచార్జీ పీడీ ఏ. మహేష్, కళాశాల సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.


ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

● 850గ్రాముల గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో ఎండు గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను అరెస్ట్ చేసినట్టు భీంగల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కమ్మర్‌పల్లి శివారులోని హాసకొత్తూర్ రోడ్డు వద్ద కొందరు యువకులు గంజాయి అమ్ముతున్నరన్న సమాచారం మేరకు ఏర్గట్ల ఎస్ఐ కే.రాజు, కమ్మర్‌పల్లి ఏఎస్ఐ ఇస్మాయిల్ అక్కడకు వెళ్లారు. అక్కడ ఉన్న మండలంలోని కోనాసముందర్ గ్రామానికి చెందిన కొండ రాజేష్, కల్ల దేవరాజు, కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన మద్దెల ఈశ్వర్, లోలం గణేష్, చిత్తారి వంశీ తనిఖీ చేశారు. వారి వద్ద 850గ్రాముల ఎండు గంజాయి లభించింది. యువకులను విచారించగా ఎండు గంజాయి అమ్ముతున్నట్లు వెల్లడయ్యింది. నిర్మల్ జిల్లా నుండి కొనుగోలు చేసి ఇక్కడ అమ్ముతున్నట్లు యువకులు విచారణలో వెల్లడించినట్టు సిఐ తెలిపారు. యువకులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. పట్టుకున్న ఎండు గంజాయిని సీజ్ చేసినట్ల తెలిపారు. ఎండు గంజాయి అమ్ముతున్న యువకులను పట్టుకోవడంలో చురుగ్గా వ్యవహరించిన ఏర్గట్ల ఎస్ఐ రాజు, కమ్మర్‌పల్లి ఏఎస్ఐ ఇస్మాయిల్, హెడ్‌కానిస్టేబుల్ రవేష్(కమ్మర్‌పల్లి), కానిస్టేబుళ్ళు శేఖర్(కమ్మర్‌పల్లి), సురేష్(భీంగల్), విజయ్(ఏర్గట్ల) ను సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.